# తేడా

కేతు విశ్వనాథ రెడ్డి

అన్ని గండాలనూ గట్టెక్కించి తమ పెళ్ళి జరిపించిన తమ కొలీగ్ నాయుడు పెళ్ళికి శ్రీలత, రాఘవ తప్పక వెళ్లాలనుకున్నారు. పెళ్ళి రాజంపేటలో.

''పనిలో పని మీ ఊరు వెళ్దామండీ. మీ అమ్మావాళ్లను చూసినట్లుంటుంది. వాళ్లను హైదరాబాద్‌లో మన పెళ్లి రోజు చూసిందే. సంవత్సరమైంది'' శ్రీలత రాఘవను అడిగింది.

రాఘవ వెంటనే 'పోదాం' అనలేదు.

'ఇద్దరం డెయిలీ వేజ్ వర్కర్లమే. వారం దినాలు జీతం నష్టం ఎలాగూ తప్పదు. ట్యూషన్లు కూడా నాకు వారం పోతాయి. అయినా ఇలాంటప్పుడు అవి చూసు 'కుంటే ఎలా? ఇంకేంఆలోచిస్తారు?'

'సరే' అన్నాడు రాఘవ.

రాజంపేట టౌను కాబట్టి అంతో ఇంతో మేలు సరే. అత్తగారి ఆ పల్లెటూరూ, ఆ ఇల్లూ, ఆ ఇంటి వాతావరణమూ ఇంత అధ్వాన్నంగా, అన్యాయంగా, దుర్భరంగా వుంటాయని శ్రీలత కలలో కూడా అనుకోలేదు. కడప ప్రాంతాల్లోని గ్రామ కక్షలు, హత్యలు, మొండి పట్టుదలలు, అభిమానాలు, కరువులు- వీటి గురించి రాఘవ అప్పుడప్పుడు కబుర్లు చెప్పక పోలేదు. వార్తా పత్రికల్లో కూడా శ్రీలత వీటిని గురించి ఎప్పుడో ఒకప్పుడు చదవకపోలేదు. కబుర్లకన్నా వార్తల కన్నా వాస్తవం భయంకర మైంది.

రైలు దిగాక రెండు బస్సులు మారవలసి వచ్చింది. రోడ్డు దిగి ఒక కిలోమీటరు పైగా నడవ వలసి వచ్చింది. హైదరాబాద్‌లో ఇంటి నుంచి బస్ స్టాపుల దాకా నడవటాలూ, వాటికోసం పడిగాపులూ, వాటిలో బాధలూ నిత్యం అనుభవమే కాబట్టి, శ్రీలతకీఆ నడక కష్టమనిపించలేదు. కానీ అత్తగారి ఊరి పరిసరాల్ని చూసి చూడ్డంతోనే శ్రీలత జడుసుకుంది.

ఊరికి ఒక పక్క బోడి కొండ గుట్టలు. మరొక పక్క బండరాళ్ల దీవులున్న నీళ్లంటూ లేని వల్లటి ఇసుకవంక. చెట్లూ చేమల్లేని మెట్ట చేలు. ఊరి ముందు కాస్త పచ్చదనమున్న ఒకటీ అరా తోటలు. ఆకాశంలో ఆ ఊరికి కొంత దూరంలో వున్న సిమెంటు ఫ్యాక్టరీల పొగ గొట్టాల్లోంచి వచ్చే దుమ్ము పొగలు. అవే అక్కడి మబ్బులు. ఊళ్లో ఒకటో రెండో వేపచెట్లు.

అత్తగారిల్లు శ్రీలతకో చుట్టూ గోడలు కట్టిన స్తంభాలు మంటపంలాగా తోచింది. ఇంట్లోకి వెళుతూనే కుడివైపు గాడి, పశువులు, కసువు, పేడ, గంజు. ఎడమవైపు వంటా వార్పూ, తిండీ తీర్థమూ, నలక మంచాలూ, ఈగలూ. తాము వెళ్లిన రోజు రాత్రి వేసిన పడకలను చూసి, శ్రీలతకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోని జనరల్ వార్డులు గుర్తుకొచ్చాయి. జంతువులూ, మనుషుల సహజీవనం శ్రీలతకు ఘోరంగా కనిపించింది. కరెంటు రోజులో ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియదు. అత్తగారి ఊళ్లో వున్న ఆ వారం రోజుల్లో శ్రీలత తమ పుట్టి పెరిగిన తెనాలి దగ్గర్లోని గ్రామాన్ని కనీసం ఐదారు పర్యాయాలు గుర్తుచేసుకుంది.

తను పుట్టి పెరిగిన ఊరు- ఊరి బయట తామర కొలను, చుట్టూ నీటిలో కలకలలాడే పంట కాలువలు, పంట పొలాలు, పొలాల్లో వరినాట్లూ, వరి కోతలూ, మార్పిళ్లూ, ఎప్పుడూ మనుషుల సందడి. ఇళ్ల ముందూ, పెరళ్లలో కొబ్బరి చెట్లూ, బాదాం చెట్లూ, పూలమొక్కలూ. ఏదో ఒక్క ఎకరా మాత్రమే భూ స్థితి కలిగిన తమ ఇంట్లో కూడా ఒక కొబ్బరి చెట్టు. శుభ్రంగా పడుకోడానికి ఒక గది. మనుషుల కాపురానికి దూరంగా పెరట్లో గేదెల కొట్టం. నీళ్లకు కరువు లేదు, గాలికి కరువు లేదు, కంటికి కనపడని దరిద్రం లేదు. అత్తగారి ఊళ్లో అన్నిటికీ కరువే.

హైదరాబాద్‌లో భరత్‌నగర్ కాలనీలో కాపురం వుంటున్న తమ ఇంటి కంటే అత్తగారిల్లు విశాలంగా కనిపించడం వల్ల శ్రీలత సమాధానపడింది.

మెట్టినూరినీ, అత్తగారింటినీ తన అనుభవంలో పోల్చి చూసుకోవడం వల్ల అవి ప్రశ్నార్థకాలయ్యాయి. అత్తగారింట్లోని వాతావరణం ఒక పదబంధ ప్రహేళికలా కనిపించింది. ఆ ఇంట్లో శ్రీలతకు గొడ్డు చాకిరీ చేసే వెట్టివాళ్లలాగా అత్తగారూ భర్త మేనత్తా కనిపించారు. అత్తగారు తెల్లవారు జామున్నే లేచేది. అప్పటి నుంచి రాత్రి ఏ తొమ్మిదింటి దాకానో పని చేస్తూనే వుండేది. పాలు పితకడం, మజ్జిగ చిలకటం, కాఫీలు, అన్నాలు చేయడం, చెరుక్కోవడం, విసురుకోవడం, నీళ్ళు తెచ్చుకోవడం, తోట దగ్గరకు సంగటి గంపనెత్తు కొని పోవడం, కళ్లం నుంచి మేవు తేవటం, గొడ్లకు మేవు వేయడం, వాటికి నీళ్ల తాపటం, వాటిని కడగడం, బోకీ బోలే కడుక్కోవడం- ఇవన్నీ ఒక మర మనిషిలాగా ఆమె చేయడం శ్రీలత గమనించింది. డెబ్బై ఏళ్ళ ముసలామె- భర్త మేనత్త వంగిన నడుంతోనే కసువు ఊడ్చడం, పేడ తీయడం, గంజు ఎత్తడం, మరేదో పని చేయడం శ్రీలత చూసింది. ఆ ఇద్దరి చాకిరీ చూశాక శ్రీలతకు వాళ్ల మీద తన తల్లిమీద లాగే గౌరవం ఏర్పడింది. అయితే శ్రీలతకు మామగారి మీదా, బావగారి మీదా తన తండ్రి మీదలాగా సద్భావం ఏర్పడలేదు.

శ్రీలత తన తండ్రిలో మామ, బావలను పోల్చి చూసుకుంది. తన తండ్రి వున్న ఆ ఒక్క ఎకరాలోనే కష్టపడి తనను ఎం.ఎ. చదివించాడు. బైపు నేర్పిం చాడు. శ్రమ పట్ల గౌరవాన్ని కలిగించాడు. సొంత వ్యక్తిత్వం అలవరచుకోవడానికి సాయపడ్డాడు. మామగారి పని బీడీలు తెగ కాల్చడం, వచ్చే పోయే వాళ్ళతో ఏవో మాట్లాడుతూ కూర్చోవడం. బావగారి పని సిగరెట్లు కాలుస్తూ రాజకీయాలు చర్చించడం. వాళ్ళిద్దరిలోని సోమరితనాన్నీ, డాబునూ, దర్పాన్నీ, కాకమ్మ కబుర్లనూ చూశాక, ఒక్క పని ముట్టకుండా తిరగటాలు పరిశీలిం చాక శ్రీలతకు కంపరమెత్తింది. పని ముట్టుకోవడం పాపం అనుకునే వాళ్ళను తాను పనిచేసే ఆఫీసులో చూసింది. కాని తన ఊళ్లో చూల్లేదు. తన భర్త రాఘవలో తాను అప్పుడప్పుడూ దర్శిస్తున్న లక్షణాలకు మూలాలేవో మామ, బావల్లో శ్రీలతకు దొరికి నట్లయింది.

ఆ మూలాలు మరిది దివాకర్‌లో కూడా పరిశీలించ డానికి శ్రీలత రెండురోజులు ప్రయత్నించింది. ఇంటర్‌పాసయి చదువు మానేసిన దివాకర్‌లో శ్రీలతకు ఆ మూలాలేవీ కనిపించలేదు. ముప్పై వలభై బిందెల నీళ్ళను దూరాన వున్న బావి నుంచో, బోరింగు నుంచో తేవడంలో తల్లికి తోడొస్తున్న దివాకర్‌ను చూసి

శ్రీలత మెచ్చుకోకుండా వుండలేక పోయింది. రాఘవ ముందు మనసారా మెచ్చుకుంది కూడా. "వాడి మొగం. ఇంకే పని చేస్తాడు?" అని రాఘవ కొట్టిపారేశాడు. తాను మాత్రం నీళ్ళ బిందెలు ఎదురందుకోవడానికి మాటవరుసకైనా వెళ్లలేదు 'డైలీ వేజస్ విదవుట్ ఆర్డర్స్' కింద రోజుకు ఇరవై అయిదు రూపాయిలకు కూలి చేస్తున్న తన భర్తలో శ్రీలత ఎం.ఎ. గిరను ఎప్పుడో గుర్తించింది. 'మానవ శ్రమ పట్ల ఆరాటం కానీ, గౌరవం కానీ, సానుభూతి కానీ ఆ మహానుభావుడికి లేదని ఇక్కడ రుజువైంది' అని శ్రీలత అనుకుంది.

వచ్చిన మూడో రోజు నీళ్ళ బిందెలందుకోవటానికి శ్రీలత వెళ్లింది. ముందు అత్తగారు "నీకెందుకమ్మా, మేమున్నాం కదా" అని ఆప్యాయంగా గట్టిగానే వారించింది. 'నీకెందుకొదినా, నేమున్నాకదా' అని

"మా తోటలూ దొడ్లూ ఏం చూస్తావొదినా. మీ వైపులాగా వుంటాయనుకోకు"

"మీ తెనాలి వైపు తెలుసా?"

"ఎందుకు తెలీదు! తెలుగు సినిమాలు చూసినా కదా"

దివాకర్ హాస్యోక్తిని ఆనందిస్తూ శ్రీలత అడిగింది.

"తెలుగు సినిమాల్లో ఏం చూశావు?"

"అదేం వదినా అట్లా అంటావు. కృష్ణా, గోదావరి చుట్టూ తిరిగేవే కదా మన సినిమాలన్నీ. కాలువ గట్లూ, కొంకాయ చెట్లూ, వరి పైరూ, చెరుకు తోటలూ, పూల తోటలూ. ఆ సీనరీ మధ్య పాటుల్లోనూ, పంచె కట్టుల్లోనో ఎగరటాలూ, ఎగరవేసిన చీరల నడుమ గెంతటాలూ- అవన్నీ ఆ పక్క- మీపక్క పల్లెల్లో తీసినవే కదా. ఈ ఊళ్లో సీనరీ ఏముంది? ఇక్కడ

కావు కదా ఇవి. కనీసం మీ ప్రాంతాల్లో లాగా"

దివాకర్ తెలివితేటల మీద శ్రీలతకు గురి ఏర్పడింది. కాసేపు ఆలోచించి అంది:

"అసలు కారణం అది కాదేమో. మారే పరిస్థితులతోపాటు మారకపోవడం కారణమేమో. మా సంగతి తీసుకో. మా కుండేది ఒక్క ఎకరం. నాన్న పొలం పని చూసుకుంటూ, పెరట్లో ఆకు కూరలూ, కాయగూరలూ పండిస్తాడు. కోళ్ళను పెంచుతాడు. మా అమ్మ రెండు ముర్రా గేదెలను పెట్టుకుంది. పాలు అమ్ముతుంది. అలా శ్రమపడతారు."

"నువ్వు మా నాన్ననూ పెద్దన్ననూ మనసులో పెట్టుకొని అంటున్నావనుకుంటా. ఏమైనా వాళ్ళ ప్రేమచంద్ శవదహనం కథలోని తండ్రీకొడుకులు కారులే వదినా"



దివాకర్ అన్నాడు. శ్రీలత బలవంతంగా అత్తగారి వద్ద నుంచి బిందె అందుకుంది. వదిన అంటే దివాకర్‌కు గౌరవం ఏర్పడింది. ఆ రకంగా చనువూ ఏర్పడింది. ఆ రోజు తీరిక దొరికినప్పుడు హైదరాబాద్ కబుర్లు శ్రీలత నుంచి దివాకర్ రాబట్టాడు. కొంత సాహిత్య చర్చ కూడా చేశాడు.

ఆ మరురోజు సాయంత్రం శ్రీలత రాఘవను అడిగింది.

"తోటలన్నా చూసి వద్దాం. వెళ్దాం పదండి"

"నాకు కొంచెం ఊళ్లో పనుంది. దివాకర్ తీసుకు పోతాడు. పోయిరా," అన్నాడు రాఘవ. అక్కడే వున్న దివాకర్ వైపు చూస్తూ.

దివాకర్ వెంట ఊరి బయటి తోటల్ని చూడడానికి శ్రీలత బయలుదేరింది. దారిలో దివాకర్ అడిగాడు:

సినిమాలు తీస్తే ప్రొడ్యూసర్లు మట్టిగొట్టుకొని పోతారు. ఫిల్ము డబ్బాలను వెంకటేశ్వరుడు కూడా రక్షించలేడు"

దివాకర్ నవ్వులో శ్రీలత తన నవ్వును జతకలిపి అంది:

"ఇక్కడ సీనరీ లేకేం దివాకర్? ఈ ఊరూ, దూరంగా ఈ సిమెంట్ ఫ్యాక్టరీలూ.." పరిసరాల్ని అసహ్యించుకొన్నది మరిచి ఆవేశంలో శ్రీలత అంది.

"సినిమాల్లో సీనరీల మాటేమో కానీ వదినా! ఆ ఫ్యాక్టరీలే ఇప్పుడు భూములు పోగొట్టుకున్న రైతులకు దిక్కయినాయి. ఇక్కడి అభివృద్ధి ఇదే."

"అంటే?"

"ఏముంది? కరువుల్తో, అప్పుల్తో భూములమ్ముకోక తప్పదు. అమ్ముకొన్నాక కూలికో నాలికో పోక తప్పదు. భూములు పోగొట్టుకున్న వాళ్లందర్నీ భరించే పొలాలు

దివాకర్ వైపు శ్రీలత ప్రశ్నార్థకంగా చూసింది.

"అదే వదినా. ఆ కథ కఫన్ ఆధారంగా తీసిన 'ఒక ఊరి కథ' చూసి వుంటావు కదా"

శ్రీలతకు తట్టింది. శ్రీలత ఆ సినిమాను చూసింది. శ్రీలత మరింత ఆశ్చర్యపోయింది. తన మనసులో భావాల్ని దివాకర్ పసిగట్టినందుకు. 'ఇంత తెలివి గల వాడు చదువెందుకు మానుకున్నట్లు' అని శ్రీలత ఆలోచనలో పడింది.

దివాకర్ చెప్పుకుపోయాడు:

"నాన్నది పాతతరం. తన పెండ్లి కాకముందున్న యాభై ఎకరాల ఆస్తీ, సేద్యగాళ్లూ, నలుగురు వచ్చే పోయే వాళ్ళు, మందీ మార్బలం ప్రపంచంలో పీకల్దాకా మునిగి వున్నాడు. పాత కలల్లో బతుకుతున్నాడు. చిలుం పట్టిన పెద్దరెడ్ల దర్జా. పెద్దన్న సులభంగా డబ్బు

## స్పర్శ

సముద్రం మీద వెలుగులేని మట్టి ప్రమిదలు తేలిపోతుంటాయి
అదృశ్యకాంతి గృహాలు ఆహ్వానిస్తుంటాయి —
చీకటి చేపత్వాన్ని చీల్చుకుంటూ
వేడిలేని రెండు జ్వాలలు మన మధ్య సంచరిస్తుంటాయి —
పొద స్పర్శతో
మనకు పిపీలికాండమంత ప్రపంచం
అతనికి ఘంటాపథంగా మారుతుంది

గ్రహాంతరాలను చూపులతో కొలుస్తుంటాం
రెక్కలన్నీ మన చూపుల చివర వేలాడుతుంటాయి
భూగోళం తెరచిన పుస్తకమై నిరంతరం ప్రసరించే
సప్తవర్ణ స్వప్నాల్లో విహరించడానికి
నిత్యనూతన నేత్రాల కోసం శోధిస్తుంటాం

స్పర్శకందని సామీప్యాలన్నీ సుదూర తిమిర తీరాలయి
దూరాలు సమధారాలవుతాయి
శూన్యంలో కదులుతున్న చేతులు
శతకోటి కాంతి సంవత్సరాల దూరాన్ని ఎదుర్కొంటుంటాయి
మన చేతులెప్పుడూ జేబులో స్వార్థపుగుడ్లు పొదుగుతుంటాయి
కాకపోతే అప్పుడప్పుడు
మౌనంగా చేతిలోనే దారి చూపిస్తాయి

పంచేంద్రియాలు తెరలు దించుకున్నవేళ
భాషలన్నీ మౌన ఘోషయిన వేళ
దృశ్యాత్మక భాషలన్నీ నాదమయి, స్పర్శయై
తనువంతా కర్ణమయి, తనువంతా రెండు చేతులయి
ముకుళిత నేత్రాలు రెక్కలు తెగిన సీతాకోకచిలుకలయి
ఏకవర్ణ స్వప్నంలో లీనమవుతాయి

మట్టి ప్రమిదల్ని మోస్తున్న అశ్రు సముద్రాలు
మనకెప్పటికీ అపరిచితాలే

భాషలన్నీ మౌన ఘోషయిన వేళ
గుండుసూది కొసలు వేళ్ళ చివర చిరుదీపాలు వెలిగిస్తున్న వేళ
అతని నేత్రాలు తెరచాప లెత్తిన పడవలయి
చైత్ర వృక్షశాఖలయి, జ్యోత్స్నాకాశమయ్యే తరుణం కోసం నిరీక్ష—

అతడు అంధుడయితే
సూర్యచంద్రులు రెండూ చూపులేని కనుపాపలు
భూగోళం ఘనీభవించిన అశ్రుబిందువు.

— పెన్నా శివరామకృష్ణ

సంపాదించాలనుకుంటాడు. రాజకీయాల్లో దిగితే ఎప్పటికైనా సంపాదించలేకపోతానా అని వాటిని పూసుకొని. తిరుగుతాడు. పెద్దన్నకు తెలియంది ఒకటే, వీళ్ళ రాజకీయాలకు పెట్టుబడి వుండాలని. మోసాన్ని పెట్టుబడిగా పెట్టగల తెలివితేటలు పెద్దన్నకు వున్నాయనుకోను."

"మరి నువ్వేం చేయాలనుకుంటున్నావు?"

ఎదురు చూడని వదిన ప్రశ్నకు దివాకర్ తబ్బిబ్బు అయ్యాడు. ఆలోచనలు కూడగట్టుకొని మిరప తోట వైపు చూస్తూ అన్నాడు.

"నేనా? మన ఈ రెండెకరాల తోటా ఆయకంలో వుంది. చెలి పొలం ఏడెకరాలుంది. అది ఒక ఏడాది పండుతుంది. మరొక ఏడాది ఎండుతుంది. ఈ గొడవల్లో ఆస్తి పంచమని నానా గొడవ చేసి పెద్ద వదిన పుట్టింటికి పోయింది పిల్లలిద్దర్నీ తీసుకొని. ఏం పంచుకొని తిందామనుకున్నారో? అట్టడుగు చేరుకునే రోజులొస్తున్నాయి."

ఆ అట్టడుగు ఏమిటని శ్రీలత అడగలేదు. దివాకర్ మాటలను బట్టి సంసారం స్థితిని ఊహించుకుంది. నీళ్ళుసరిగ్గా లేక గిడసబారి ఒకటీ అరా మిరపకాయల్తో ఉన్న మిరప తోటను చూశాక ఆ ఊహకు ఒక వాస్తవాకారం ఏర్పడింది. తాను నాలుగు రోజులుగా చూస్తున్న ఇంట్లో ఖర్చులు, దుబారా గుర్తుకొచ్చాయి.

ఈ అట్టడుగులోంచి తన భర్త భాగానికి దొరికే చిల్లి గవ్వంటూ వుండదని శ్రీలత భావించింది. ఇక్కడ జీవితాన్ని నెలనెలా పదహారు వందలకు పైగా వచ్చే తమ ఇద్దరి సంపాదనలో శ్రీలత పోల్చి చూసింది. తానే మెరుగు అనుకుంది. దివాకర్ను హైదరాబాద్ పిలుచుకుని వెళ్ళి, ఏ అటెండరు ఉద్యోగమో ప్రయత్నిస్తే అనుకుంది. ఉద్యోగం అంత సులభంగా దొరకదని అనుకుంది. ఇక్కడే ఇల్లాంటి పరిస్థితుల్లో దివాకర్ లేకపోతే ఇంకా సమస్యలొస్తాయి అనుకుంది. అత్తగారి నీళ్ళ బరువును దివాకర్ తగ్గించడం గుర్తుకొచ్చింది. ఏ సహాయమూ ఇప్పట్లో చేయలేని నిస్సహాయత్వానికి శ్రీలత సిగ్గు పడింది.

ఏదో కల్పించుకుని అడగాలని శ్రీలత అడిగింది.

"మా ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ వెయ్యక పోయ్యావా?"

"సమయం రానీలే వదినా. తీరిక ఉన్నప్పుడల్లా అవో ఇవో చదువుతున్నాలే - పక్క ఊళ్ళో ఒక స్నేహితుని దగ్గర్నుంచి తెచ్చుకుని"

శ్రీలత మనసు నిర్వేదంతో నిండిపోవడం వల్ల ఏం చదువుతున్నావని అడగలేక పోయింది.

తోటలో ఎండిపోయిన ఒక మిరప మొక్కను పీకి దూరంగా వేస్తూ దివాకర్ అన్నాడు.

"మాడొదినా! నువ్వు ఎం.ఎ. సోషియాలజీ చదివినావు. అన్న ఎం.కాం. చదివినాడు. అన్న చెప్పేవాడు. నీదేమో 'డెయిలీ వేజెస్ విత్ ఆర్డర్స్' అన్నదేమో 'వితవుట్ ఆర్డర్స్' నాలుగేండ్లుగా. పని చేస్తే రోజుకు ఇరవై అయిదు. ఇక్కడ ఆడ కూలీల సంగతటుంచు. మగకూలీకి రోజుకు ఇరవై. ఫ్యాక్టరీలో ముప్పైఅయిదుకు పైనవస్తుంది. ఏ శ్రమ గొప్పదంటావు? చిన్నన్నను అడిగితే 'నాదే గొప్పదంటాడనుకో'. అది వేరే విషయం. నా ఉద్దేశంలో అసలు ఏ శ్రమకూ వ్యక్తిగతంగా విలువ వుండదనీ, లేదనీ - మీ చదువులకూ, మీరు చేసే ఉద్యోగాలకూ సంబంధం లేనట్లు"

తన భర్త ఇంట్లో మనిషేనా ఈ దివాకర్ అని శ్రీలత ఆశ్చర్య పోయింది.

"చీకటి పడతావుంది. పోదాం వదినా" అన్న పిలుపుతో శ్రీలత ఆశ్చర్యం నుంచి తేరుకుంది.

హైదరాబాదు వెళ్ళడానికి ముందురోజు చుట్టూ ఎవరూ లేనిది చూసి భర్తతో అత్తగారింటి విషయాలను, ముఖ్యంగా దివాకర్ భవిష్యత్తును వర్ణించింది.

"వాడిక్కడ వుండడమే మేలు. వీడు లేక పోతే ఇంటి దగ్గర వ్యవసాయం కట్టి పెట్టాల్సిందే.వీడు చదువు మానేసి వుండవల్ల అదొక మేలు జరిగింది. పైగా చదువు ఖర్చులు తగ్గినాయి. వీడి పుణ్యమా అని ఒకటి రెండేళ్ళు కాస్త మంచి పంటలు పండితే. రేపు మనం భాగం ఏదన్నా అడిగినా ఇస్తారు"

భర్త రాఘవ దూరాలోచనమూ, పగటి కలలనూ చూసి శ్రీలత విస్తు పోయింది.

రాఘవతో శ్రీలత హైదరాబాదు చేరుకున్నాక, ఒక వారం పది దినాలు అత్తగారి ఊరినీ, ఆ ఇంటినీ మరువలేకపోయింది. ఆలోచించినప్పుడల్లా, ఆ ఇంటి దుస్థితికి ప్రధాన కారణం కాలానుగుణంగా మారకపోవడమే, ఒళ్ళు వంచి కష్టపడి సంపాదించుకోక పోవడమే అని నమ్మింది. ఆ ఊరి ప్రకృతి, పర్యావరణమూ, ఇంటి ఆర్థిక సూత్రాలూ శ్రీలతకు అర్థమైనట్లూ, కానట్లూ

తోవాయి. రెండు వారాలు గడిచాక తన సమస్యల తిరగలిలో - ఆఫీసు, ట్యూషన్లు, ఇంటి పనిలో - పడిపోయింది

ఆఫీసులో పని దొంగల్నీ, బుల్లి రాజకీయ నాయుళ్ళీ చూసినప్పుడూ, మొత్తం ట్యూషన్లనూ, ఇంటి పనినీ తన నెత్తి మీదనే వేస్తున్న భర్తను పరిశీలించినప్పుడూ మామగారూ, బావగారూ శ్రీలతకు గుర్తుకొచ్చేవారు. వాళ్ళతో రాఘవను పోల్చి చూసుకునేది. చొరవ లేదు కానీ, అంత అన్యాయం కాదు అని అనుకునేది. తన చాకిరీలో మెట్టినింట్లోని అత్త, భర్త నేవత్తల వెట్టి చాకిరీతో పోల్చుకునేది. విసుక్కునేది. ఉద్యోగస్తులైన ఆడవాళ్ళ చాకిరీ మరింత అన్యాయం అనుకునేది. మహిళా సమస్యల్ని చిత్రించిన ఏ కథో, నవలో చదివినప్పుడు ఇంకా మండి పడేది. అత్త, రాఘవ నేవత్తల మూగ బాధ ఎలా వుంటుందోనని ఆలోచించేది. కాలా నుగుణంగా తామిద్దరూ మారేదెలా తమ పరిస్థితిని చక్క దిద్దుకునేదెలా అని తెగ ఆలోచించేది. శ్రీలత ఊహల్లో తామిద్దరి ఉద్యోగాలూ ఖాయమై పోయేవి, తండ్రి తనకివ్వబోయే ఇల్లూ, పొలమూ అమ్ముదు పోయ్యేది. ఆ డబ్బుతో ఇళ్ళ స్థలం కొనుక్కునేది, ఇల్లు కట్టుకునేది. ఒక్కొక్కప్పుడు ఆమె కలల్లో ఆర్డరు లేని భర్త ఉద్యోగం ఊడి పోయేది.

అత్తగారిల్లు శ్రీలతను చాలా రోజులు వేధించింది. ఒక్క ఏడాది గడిచింది. శ్రీలత కుటుంబ జీవితంలో ఏ మార్పూ రాలేదు.

ఆ రోజు శ్రీలతకు దివాకర్ నుంచి ఒక ఉత్తరం అందింది.

శ్రీలత వదినా!

నా ఇంటర్ మీడియెట్ తెలుగుపరిజ్ఞానంతోరాస్తున్న ఈ ఉత్తరంలో తప్పులుంటే ముందుగా క్షమించు. మరీ క్షమించవలసినవి ఏక వచన ప్రయోగాలు. అవి ఈపాటికి అలవాటయి వుంటాయిలే. నువ్వు మన ఊళ్ళో ఉన్నది వారం దినాలే అయినా, నీ గ్రహణ శక్తి మీద నాకెంతో గౌరవ భావం ఏర్పడింది. అంతేకాదు. నువ్వు హృదయమున్నదానివి.

ఆయకంలోని తోట అప్పుల వాళ్ళ పాలైంది. మెట్ట సేద్యంలో ఏడాది పొడువునా పని ఎట్లాగూ వుండదు. అప్పట్టు తోటల దగ్గరకు మనం పోతున్నప్పుడు నువ్వన్నావు - పరిస్థితులలో పాటూ మారక పోవడమూ, శ్రమను నమ్ముకోక పోవడమూ ఇక్కడి దుస్థితికి కారణమని, మీ అమ్మానాన్నలతో పోలిక తెచ్చినావు. మీ అమ్మ రెండ గేదెలను పెట్టుకుని పాలు అమ్ముతుందనీ, నాన్న సేద్యంతోపాటు, కాయగూరలూ అవీ కాయించీ, కోళ్ళను పెంచీ కొంత సంపాదిస్తాడనీ. అప్పుడు నేను జవాబు చెప్పలేదు దీనికి. ఆ శ్రమ మీద నాకు గౌరవం లేక పోలేదు. కానీ ఆ రకం శ్రమ మీద కన్నా, ఆ సంబంధాల మీదకన్నా, సిమ్మెంటు ఫ్యాక్టరీలో పనిచేసే కూలీల శ్రమమీదా వాళ్ళ సంబంధాల మీదా నాకు నమ్మకం ఏర్పడింది. నేనందుకే వాళ్ళలో కలిసి పోయాను. శ్రమ ఖరీదు తెలుసుకుంటున్నా.

ఇంటిలో బంధాలు తెగి పోయినాయి, మూగ జీవి అమ్మతో తప్ప, నాకు వచ్చే వచ్చే ఏ ఆస్తీ అక్కరలేదని బయట పడినా. ఆ ఊబిలోంచి బయట పడడానికి అదొకటే మార్గం నాకు కన్పించింది. లేకపోతే కట్నం ఆశపడతారు. రాజీ పడితే కొన్నాళ్ళకు ఇక్కడ నేను మా నాన్నగానైనా మారిపోవాలి, మా పెద్దన్నగానైనా మారాలి. మా చిన్నన్న రాఘవ మాదిరి నేను కుదురు మనిషిని కాదు.

ఇప్పుడైనా మా నాన్నకూ, పెద్దన్నకూ తెలిసి వస్తే మంచిదే. లేకపోతే ఇట్లాగే కొన్నాళ్ళు బతుకు ఫీడ్చి, మా అమ్మ, మా వదినో కూలి పనులకు పోతే నాటి మీద తమ రకం బతుకుబతక్కపోరు.

మా భూమి చరిత్రా, భూమి పుత్రుల చరిత్రా ఈ రకంగా తప్ప, మరొక రకంగా వుంటుందంటావా? చిన్నన్నను అడిగినట్టు చెప్పు.

మీ

మరిది దివాకర్

శ్రీలత ఈ ఉత్తరాన్ని నాలుగైదు మార్లు చదువుకుంది. కలవరపడింది. క్షోభ పడింది. నిర్వేదపడింది. భర్త రాఘవకు చూపినప్పుడు, సాంతం చదివి కటువుగా రెండే ముక్కలన్నాడు.

"వీడు జైలుకన్నా కూడా పోయేరకం... చావనీ ఇంక ఊరి దగ్గర్నుంచి మనకేమీ వచ్చేదుండదు - మీ అమ్మా నాన్న మిగిలించి ఇచ్చేదేదో తప్ప"

భర్త శాపనార్థాలను విన్నాక ఆశలను చూశాక శ్రీలతకు ఇరవై ఏళ్ళ మరిది దివాకర్, ఇరవై ఆరేళ్ళ భర్త కంటే చాలా చాలా ఉన్నతంగా కన్పించాడు. కానీ ఆమె అనుకున్న ఎత్తు మూలాలు దివాకర్‌కు ఎక్కడి నుంచి వచ్చాయో అని ఎప్పుడూ ఆలోచిస్తూనేవుంటుంది పాపం!

## ఛీర్స్

ఆమె పెగ్గుడు సిగ్గొలకబోసే వేళ
ఎన్ని చుక్కల హుక్కులని విప్పుకోను మృదువక్షోస్పర్శ కోసం?
రాత్రి వాసన తెలిసిన పమేరియన్ శునకాన్ని నేను
పావనామయలోకాల దివ్యరశ్మికై దేవులాడుతూ
నా ఓపెన్ సెసేం మంత్రాక్షరాలని
ఇక్కడే ముద్రాక్షసాలు మూర్ధాభిషిక్తమైనచోట కోల్పోయాను
అనావిష్కృత చిత్రంమీద ఆరీ ఆరని సంతకంలా
ఆమె తాకినంత మాత్రాన
నేను రంగులుప్పొంగే కాన్వాసునవుతాను
రంగులతో తలంటుకునే కుంచెనవుతాను
ఆమె చూపు విదిలిస్తే
అనంత గేలక్సీల నుంచి గాలాల వాన కురుస్తుంది
తొంగి చూసే, తిరిగి వెనుతిరిగి చూసే,
గుండెలు గాయపడిన ఎన్ని తుంటరి మబ్బు పింజల్ని అదిలించను?
ఈ సార్వకాలిక, సార్వజనీన దర్పణంలో
మనిషి ఎన్ని తెగింపుల మెట్లెక్కితే తేరిపారచూడగలడామె నన్ను?
ఆమె తలకోనలోని గెరిల్లా మల్లెపూలు
ముకుతాడేసి లాక్కుపోతున్నాయీ వేళ నన్ను
మేను జలదరించి మెనూలో తలదాచుకున్నా
గ్లాసులుండాల్సిన చోట పెదవులూ,
కాక్‌టైల్‌కి బదులు కౌగిలింతలూ
ఎమ్మెల్‌లలో కొలవలేని అందం వశమై,
నన్ను వివశుణ్ణి చేసేందుకు
ప్రేమించి పాన పాత్రంత సున్నితంగా సన్నిహితమయింది
గాలి రహస్యాల రాయబారి
అప్పుడెగిన పుప్పొడులు మోసుకుపోతూ ఆగి
ఈసుతో చెప్పింది కదా - ఛీర్స్!

—రామతీర్థ